మెట్రో రైలులో ప్రయాణం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు

ఐ ఫోకస్ సేవలు అభినందనీయం

మనిషిలో మానవత్వ విలువలను పెంపొందిస్తున్న సంస్థ: హరీశ్‌రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)/ఉప్పల్/రవీంద్రభారతి: మనిషిలో మానవత్వ విలువలు పెంపొందించేవిధంగా పనిచేస్తున్న ఐ ఫోకస్ సంస్థ సేవలు అభినందనీయమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. విలువలను కాపాడుతూ, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సంస్థ నేర్పడం గొప్పవిషయమని మెచ్చుకున్నారు. ఉప్పల్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన ఐ పోకస్ సంస్థ 18వ వార్షికోత్సవానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసానికి, సమాజ రక్షణ కోసం పనిచేస్తున్న ఐ ఫోకస్ సేవలను కొనియాడారు. విద్యార్థులలో ఏకాగ్రత, మహిళల్లో ఆత్మవిశ్వాసం, ఉద్యోగుల్లో సమర్థత, యువతలో చైతన్యం నింపడం, వ్యాపారుల్లో నైపుణ్యం పెంచేలా తోడ్పాటు అందించడం హర్షనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో ఆటా వేడుకలు

అమెరికా తెలుగు సంఘం(ఆటా) ముగింపు వేడుకలు శనివారం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వివిధ రంగాలకు చెందిన పలువురు నిపుణులను, సంఘ సేవకులను, కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆటా ప్రెసిడెంట్ మధు బొమ్మినేని, ఎలక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా నాయకత్వంలో సంబురాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు ఆటా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. ఆటా ప్రతినిధులు ఏ దేశంలో ఉన్నా మృతృభూమిని మరువకుండా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటా కోశాధికారి సతీశ్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు పరమేశ్ భీమ్‌రెడ్డి, ఈశ్వర్ బండా, అనిల్‌కుమార్ బోయినపల్లి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు కాటపల్లి వెంకటరమణారెడ్డి, యశస్వినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్రోలో హరీశ్‌రావు ప్రయాణం

ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం సాయంత్రం మెట్రో రైలులో ప్రయాణించారు. ఎల్బీనగర్ నుంచి లక్డీకాపూల్ వరకు మెట్రోలో ప్రయాణిస్తూ ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. నాగోల్ శిల్పారామంలో ఐ ఫోకస్ సంస్థ కార్యక్రమంలో పాల్గొని, రవీంద్రభారతిలో ఆటా కార్యక్రమానికి రావడానికి రోడ్డు మార్గంలో ఆలస్యమవుతుండటంతో మెట్రో ఎక్కారు. ఎల్బీనగర్ నుంచి లక్డీకాపూల్ వరకు మెట్రో వచ్చిన హరీశ్‌రావు.. అక్కడ దిగి రవీంద్రభారతిలోకి వెళ్లారు.

రాజస్థాన్ కరెంట్ అప్పు 53 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

నిజాలు అయిపోవని అన్నారు. ఒక్క చాన్స్ అని అడిగి, తీరా అధికారంలోకి వచ్చాక హామీల నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. సర్కార్ ఏర్పడి 20 రోజులు దాటినా చేయాల్సిన పనిని పక్కన పెట్టి గత ప్రభుత్వంపై సాకులు చెస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం తప్పులు చేసిందని భావిస్తే సిట్టింగ్ జడ్జితోకానీ, విచారణ కమిషన్‌తో, కమిటీయో వేసి వాస్తవాలు తేల్చాలని బీఆర్‌ఎస్ పార్టీయే డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భట్టి ఏనాడూ అసెంబ్లీలో కరెంట్ కోతలపై మాట్లాడలేదని తెలిపారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

అప్పుల్లేని రాష్ట్రాన్ని చూపిస్తారా?

దేశంలో అప్పుల్లేని రాష్ట్రాన్ని చూపిస్తారా? అని కాంగ్రెస్ నేతలకు జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. అలాగే దేశంలో ఏ రాష్ట్రంలోనైనా లాభాలతో నడిచే విద్యుత్తు సంస్థ ఉంటే చూపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నిన్నటి వరకు పాలించిన రాజస్థాన్ విద్యుత్తు సంస్థ రూ.89 వేల కోట్ల నష్టాలు, రూ.53 వేల కోట్ల అప్పులున్నాయని వివరించారు. అంత అప్పు ఉన్నా రైతాంగానికి ఆరేడు గంటలకు మించి కరెంటు ఇవ్వలేదని అన్నారు. తెలంగాణలో అప్పోసాప్పో చేసి అన్ని రంగాలకు కరెంట్ ఇచ్చామని, రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇచ్చామని చెప్పారు. దేశంలో నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇచ్చిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ అని చెప్పుకోవటానికి తాము గర్వపడుతున్నామని అన్నారు. ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో విద్యుత్తు సంస్థలకు ఉన్న అప్పులను ఏకరువు పెట్టారు. విద్యుత్తు సంస్థలకు మధ్యప్రదేశ్‌లో రూ.56 వేల కోట్లు, ఉత్తరప్రదేశ్‌లో రూ.70 వేల కోట్లు, ఏపీలో రూ.25 వేల కోట్లు, మహారాష్ట్రలో రూ.25 వేల కోట్లు నష్టాలు ఉన్నాయని వివరించారు. గతంలో ఇవ్వని కరెంట్‌కు కాంగ్రెస్ పార్టీ అప్పులు తెచ్చిందని ఉదహరించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రూ.28 వేల కోట్లు అప్పు తెచ్చి తీరా మూడు, నాలుగు గంటలకు మించి కరెంట్ ఇవ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ అప్పుడు తెచ్చిన అప్పుతో కలిపి అంతా రూ.80 వేల కోట్లకు చేరిందని వివరించారు.

సబ్‌క్రిటికల్ టెక్నాలజీతోనే 39 ప్రాజెక్టులు

దేశంలో 16 రాష్ట్రాల్లో సుమారు 39 ప్రాజెక్టులు సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నడుస్తున్నాయని, అవన్నీ 2014 తర్వాత ప్రారంభించినవేనని జగదీశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోనూ అదే సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో ప్రాజెక్టులు నడుస్తున్నాయని వెల్లడించారు. ఈ టెక్నాలజీని ప్రపంచమంతా వాడుతున్నదని, తాము చట్ట ప్రకారమే దాన్ని వాడామని వివరించారు. కొత్తగా పెట్టేవే సూపర్ క్రిటికల్ టెక్నాలజీవి పెట్టాలన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తే మంచిదని గుర్తుచేశారు.

ఖాతా నంబర్ లేకుండానే దరఖాస్తా?

లబ్ధిదారుని బ్యాంకు ఖాతా నంబర్ లేకుండానే ప్రజాపాలన దరఖాస్తులు పెట్టడం విడ్డూరంగా ఉన్నదని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బ్యాంకు ఖాతా నంబర్ లేకుండా ఆరు గ్యారెంటీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తులు లేకుండానే పథకాలకు అర్హులను గుర్తించి నేరుగా నగదును అకౌంట్లలో జమ చేశామని గుర్తుచేశారు. కొత్తవారికి కూడా తెల్లరేషన్ కార్డులు ఇచ్చి గ్యారెంటీలు వర్తింపజేస్తామని చెప్తున్న కాంగ్రెస్ పార్టీ.. అసలు రేషన్‌కార్డు ఎలా దరఖాస్తు చేయాలో చెప్పలేదని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులుగా గుర్తించేందుకు ఎఫ్ఐఆర్‌లో పేరుండాలని, జైలుకు పోయినోళ్లకే ఇస్తమని హామీ ఇచ్చినప్పుడే ఎందుకు చెప్పలేదని నిలదీశారు.

అధికారులను దబాయిస్తే పనులు కావు

అధికారులను దబాయించి, బెదిరించి, ఖబర్దార్ అని హెచ్చరించే ధోరణితో వ్యవహరిస్తే పనులు కావనే విషయాన్ని మంత్రులు గుర్తించాలని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రులుగా ఉన్నవాళ్లు రౌడీలు, గూండాలుగా పని చేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. అధికారుల అనుభవాన్ని, వారి మేధోశక్తిని పరిగణనలోకి తీసుకొని వారి ద్వారా పనులు ఎలా చేయించుకోవాలో తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పటం మాని, అసలు విషయంపై దృష్టిసారించాలని చురక అంటించారు.

సర్కార్‌ను నడపటం చేతగాకే..

సర్కారును నడపటం చేతగాక కాంగ్రెస్ పార్టీ కుంటిసాకులు చెప్తున్నదని జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చి ఇప్పుడేం చేయాలో అర్థం కాక డ్రామాలు ఆడుతున్నదని మండిపడ్డారు. ఎన్ని అబద్ధాలు ఆడినా ప్రజల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రభుత్వానికి విద్యుత్తు సంస్థలను నడపటం చేతగాకపోతే అప్పిచ్చిన ఆ ప్రభుత్వ సంస్థలకే ఇస్తే అవి నడుపుకునేందుకు సిద్ధంగా ఉంటాయని సూచించారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, 24 గంటల కరెంట్ విషయంలో తప్పించుకోవటానికి వీల్లేదని అన్నారు.

గ్యాస్ కేవైసీకి కొండంత లైన్

- గంటల తరబడి క్యూలైన్లలోనే
- కేవైసీకి పోతే 400 గుంజుతున్నరు
- బెల్లంపల్లిలో వినియోగదారుల ఫైర్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 30: వినియోగదారులకు గ్యాస్ ఈ-కేవైసీ కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ముందు నిత్యం బారులుతీరుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఏజెన్సీ కార్యాలయం తెరవకముందే వేకువజాము నుంచి క్యూ కడుతున్నారు. కేవైసీ చేయడంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తాత్సారం చేస్తుంటడంతో వినియోగదారులు గంటల తరబడి వరుసలో నిలబడి ఇబ్బందులు పడాల్సివస్తున్నది. కొన్ని పట్టణాల్లో గ్యాస్ ఏజెన్సీల వారు వినియోగదారులకు టోకెన్లు ఇచ్చి తరువాత రమ్మంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గంటలు కొద్దీ బారులుతీరి అప్ డేట్ చేయించుకుంటున్నారు. మంచిర్యాల జిల్లాలో ఇదే అదునుగా గ్యాస్ కంపెనీ నిర్వాహకులు వినియోగదారుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. బెల్లంపల్లిలోని భారత్ గ్యాస్ నిర్వాహకులు రూ.200 పెట్టి గ్యాస్ పైపు కొనాలనే షరతు విధించినట్టు తెలిసింది. ఆ పైపు ఇంటికి వచ్చి బిగించేందుకు మరో రూ.200 వసూలు చేస్తున్నట్టు సమాచారం. గ్యాస్‌బుక్‌లో పేర్లు మార్చుకునేందుకు వచ్చే వారి వద్ద రూ.1300 తీసుకుంటున్నట్టు పలువురు వినియోగదారులు పేర్కొన్నారు.

ఆధార్ అవస్థలు

ఆధార్ కార్డుల్లో మార్పులు-చేర్పుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలకు ఆధార్, రేషన్ కార్డులు తప్పనిసరి చేసింది. దరఖాస్తుతోపాటు రెండు కార్డులు జతపర్చాలని సూచించింది. దీంతో తమ ఆధార్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయడం, ఇతర మార్పులు చేర్పుల కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో నిత్యం ఆధార్ సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. కొందరు టిఫిన్లు తెచ్చుకొని అక్కడే భోజనాలు చేస్తున్నారు. ఇంకొందరు చంటి పిల్లలతో వచ్చి అనేక ఇబ్బందులు పడుతున్నారు.

విద్యుత్తు సంస్థలకు అప్పులు ఉండొద్దు

మొదటిపేజీ తరువాయి...

సెక్టార్లను లాభాల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)ను సందర్శించిన ఆయన.. సీఎండీ రిజ్వీతో కలిసి సమీక్ష నిర్వహించారు. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో విద్యుత్తు ఉత్పత్తిలో సాంకేతికతను ఉపయోగించుకోవాలని, పర్యావరణంపై ప్రభావం పడకుండా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. సబ్‌క్రిటికల్ విధానంతో పర్యావరణంపై ప్రభావం పడుతుందని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కొత్త విధానానికి ప్రణాళిక తయారు చేశారని గుర్తుచేశారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీని వాడుకోవాలని, సహజ వనరులను కాపాడి, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఉన్నదని వెల్లడించారు. రైల్వే లైన్ నిర్మాణ పనులు 40 శాతం పూర్తి కాగా, ఇంకా 30 శాతం పనులు భూసేకరణ ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. సమీక్షలో ప్రత్యేక అధికారి కృష్ణభాస్కర్, సీఈ బిచ్చయ్య, జేసీ రాంబాబు పాల్గొన్నారు.

అప్పుల లెక్కలతోనే ముగించారు: రేగా కాంతారావు

బీటీపీఎస్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. కేవలం అప్పులు లెక్కలు చెప్పి అధికారులతో సమీక్ష ముగించారని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టులు కట్టకుండానే రూ.22 వేల కోట్లు అప్పు చేసిందని గుర్తుచేశారు. హామీల అమలును తప్పించుకొనేందుకే అప్పుల పాట పాడుతున్నారని ఆరోపించారు.

గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్లకు 5 లక్షల ప్రమాదబీమా

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సోషల్ సెక్యూరిటీ స్కీమ్ కింద గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ స్కీమ్ కింద చెల్లించాల్సిన ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందని కార్మికశాఖ పేర్కొన్నది.

13 వేల కోట్ల అప్పు

మొదటిపేజీ తరువాయి...

9న రూ.1,000 కోట్లు, 16న రూ.2,000 కోట్లు, 30న రూ.1,000 కోట్లు మొత్తంగా జనవరిలో రూ.4,000 కోట్లను తీసుకోనున్నది. ఫిబ్రవరిలో మొత్తంగా రూ.3,000 కోట్ల రుణం తీసుకోనుండగా, అందులో 13, 20, 27 తేదీల్లో రూ.1,000 కోట్ల చొప్పున తీసుకోనున్నది. మార్చి నెలకు గానూ 5న రూ.2,000 కోట్లు, 12న రూ.1,000 కోట్లు, 19న రూ.2,000 కోట్లు, 26న రూ.1,000 కోట్లు మొత్తంగా 4 విడతల్లో రూ.6 వేల కోట్లు అప్పు తీసుకోనున్నది. మొత్తంగా 10 విడతల్లో రూ.13 వేల కోట్ల అప్పు చేయనున్నది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, యూటీలు కలిపి వచ్చే త్రైమాసికంలో రూ.4,13,452 కోట్ల రుణాలు తీసుకోనున్నాయి.

ఇప్పటికే రూ.1,400 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఆర్బీఐ నుంచి రూ.1,400 కోట్ల రుణం తీసుకున్నది. కొత్త ప్రభుత్వం డిసెంబర్ 7న ఏర్పడగా, 5 రోజుల అనంతరమే (డిసెంబర్ 12న) ఆర్బీఐ వద్ద రూ.500 కోట్ల అప్పు చేసింది. అనంతరం డిసెంబర్ 19న మరోసారి రూ.900 కోట్లు రుణంగా తీసుకున్నది. మొత్తంగా ఒక్క నెలలో రూ.1,400 కోట్ల అప్పు తీసుకున్నది. తాజాగా వచ్చే త్రైమాసికానికి మరో రూ.13 వేల కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించడం గమనార్హం.

రవాణాశాఖలో జేటీసీల బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): రవాణా శాఖలో పలువురు సంయుక్త రవాణా కమిషనర్లను (జేటీసీ) బదిలీచేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్‌లో ఎస్/ఆర్టీఏగా ఉన్న జే పాండురంగ నాయక్‌ను అడ్మిన్‌కు బదిలీ చేసింది. అక్కడ పనిచేస్తున్న మమతాప్రసాద్‌ను ఐటీ, విజిలెన్స్‌కు.. ఐటీ, విజిలెన్స్ జేటీసీగా ఉన్న సీ రమేశ్‌ను హైదరాబాద్‌లో ఎస్/ఆర్టీఏగా పాండురంగ నాయక్ స్థానంలో నియమించింది. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఓడీలపై పనిచేస్తున్న ఎంవీఐ, ఏఎంవీఐ, హెడ్‌కానిస్టెబుళ్లు, కానిస్టెబుళ్ల ఓడీలను కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

దరఖాస్తులు దొరక్క తిప్పలు

- పొద్దునుంచే సెంటర్ల వద్ద బారులు
- రసీదులపై ఆశా వర్కర్ల సంతకాలు
- 40,57,592 దరఖాస్తులు:సీఎస్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 30: అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా గందరగోళంగా కొనసాగుతున్నది. శనివారం కూడా చాలాచోట్ల దరఖాస్తు ఫారాలు అందక జనం ఇబ్బందులు పడ్డారు. సరిపడా కౌంటర్లు పెట్టకపోవడంతో జనానికి తిప్పలు తప్పలేదు. సంగారెడ్డి జిల్లా గుమ్మిడిదలలో జనం భారీ సంఖ్యలో రావడంతో పోలీసులు గ్రామపంచాయతీ కార్యాలయ గేటు మూసేసి ఒక్కొక్కరిని లోపలికి పంపించారు. కొంత మందికి దరఖాస్తులు అందలేదు. మంగళవారం ఇస్తామని చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుబంధు ఇంతవరకు ఇవ్వలేదని, గ్యాస్ సబ్సిడీ, మహిళలకు రూ.2,500 ఇవ్వడానికి వారివద్ద అకౌంట్ నంబర్లు లేవా? అందరి ఆధార్, రేషన్ కార్డు నంబర్లు ఉన్నాయి కదా? అని సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు నాగేంద్రప్ప ప్రశ్నించాడు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కల్లపల్లి-బేలూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రజలు శనివారం రాగా, కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో నిరాశతో వెనుదిగారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నార్లపూర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెర్వు, రాయిలాపూర్, కాట్రియాల, దంతేపల్లి గ్రామాల్లో అధికారులు సందేహాలను తీర్చకపోవడంతో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రేటర్ వరంగల్ 39వ డివిజన్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని జన్మభూమి జంక్షన్‌లో ఏర్పాటుచేసిన ఓ సెంటర్‌కు వృద్ధుడు యూరిన్ పైపుతో వచ్చిన ఫొటో శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సోషల్ మీడియాలో వైరలైన యూరిన్ పైప్‌తో ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన ఓ వృద్ధుడు

రసీదులపై ఆశ వర్కర్ల సంతకాలు

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామసభలో ప్రజలిచ్చిన దరఖాస్తు ఫారాలను అధికారులు కాకుండా ఆశ వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సమభావన సంఘం లీడర్లు తీసుకొని, రసీదులపై కూడా వారే సంతకాలు పెట్టారు. దరఖాస్తు ఫారంలో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోవడంపై ప్రజలు అధికారులను నిలదీశారు. దీంతో రూ.10 ఇస్తే జిరాక్స్ షాపు వాళ్లు ఇస్తారంటూ అధికారులు సమాధానం ఇవ్వడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. అదే జిల్లాలోని నిడమనూరులో దరఖాస్తు ఫారాలు సగం మందికి అందకపోవటంతో జిరాక్స్ షాపులు, ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ మహిళా ఎంపీపీ పిల్లి రేణుక మాట్లాడుతుండగా అడ్డుకొని దుర్భాషలాడారు.

3 రోజుల్లో 40, 57,592 దరఖాస్తులు

ప్రజా పాలన కార్యక్రమం మూడో రోజు విజయవంతంగా నిర్వహించినట్టు సీఎస్ శాంతికుమారి తెలిపారు. మూడు రోజుల్లో మొత్తం 40,57,592 దరఖాస్తులు అందాయని చెప్పారు. శనివారం 1,991 గ్రామాలు, 1,877 మున్సిపల్ వార్డుల్లో మొత్తం 18,29,107 దరఖాస్తులు స్వీకరించామని వెల్లడించారు.

సుప్రీంకోర్టులో తెలంగాణ స్టాండింగ్ కౌన్సిల్‌గా కరణం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది కరణం శ్రవణ్‌కుమార్ నియమితులయ్యారు. అడ్వకేట్ ఆన్ రికార్డ్‌గా దేవిన సెహగల్, తెలంగాణ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా దివ్య ఆడెపు నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ శనివారం వేర్వేరుగా జీవోలు జారీచేసింది. వీరంతా ఆయా పదవుల్లో మూడేండ్ల పాటు కొనసాగనున్నారు.

డైరీని ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): స్టేట్ టీచర్స్ యూనియన్-తెలంగాణ స్టేట్ (ఎస్టీయూటీఎస్) 2024 నూతన సంవత్సరం డైరీని సీఎం రేవంత్ రెడ్డి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఉపాధ్యాయ నాయకులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జీ సదానంద్‌గౌడ్, ఆర్థికశాఖ కార్యదర్శి ఏ సదయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వై కరుణాకర్‌రెడ్డి, డైరీ కన్వీనర్ సుధాకర్, పరమేశ్, రామసుబ్బారావు పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణ శివారులో జరిగిన సమీక్షలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మధ్య వాగ్వాదం

ఇష్టం ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి

- ఎమ్మెల్యే పల్లాను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు
- 'కొమురవెల్లి' సమీక్షా సమావేశంలో ప్రొటోకాల్ వివాదం
- వేదికపైకి కాంగ్రెస్ నాయకులు.. అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే పల్లా

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 30: 'అంతా మా ఇష్టం.. ఇష్టముంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి' అంటూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాశంగా మారాయి. కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవం, జాతర ఏర్పాట్లపై సిద్దిపేట పట్టణ శివారులోని హరిత మినర్వా హోటల్‌లో శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారిక సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, కొందరు కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేగా ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. దీనికి పల్లా అభ్యంతరం తెలుపడంతో.. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నది. ప్రత్యేకంగా కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆహ్వానించడంపై వివాదం మొదలైనది. ఇది కాంగ్రెస్ పార్టీ సమావేశం కాదని, ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలుచుకుంటే స్టేజీ మీద ఉండకూడదని ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి అనడంతో.. 'ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలిచే హక్కు నాకు ఉంది.. మీకు ఇష్టముంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి' అని మంత్రి కొండా సురేఖ బదులిచ్చారు. దీంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. ఎమ్మెల్యేతోపాటు మరికొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు కూడా సమావేశం నుంచి బయటకొచ్చారు. అనంతరం పల్లా మీడియాతో మాట్లాడుతూ.. కొమురవెల్లి జాతర ఏర్పాట్ల సమీక్షలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం విడ్డూరమని పేర్కొన్నారు. మల్లన్న సన్నిధిలో నిర్వహించాల్సిన సమావేశాలను జాతర ఆచారాలు, సంప్రదాయాలకు వ్యతిరేకంగా.. గత 30 ఏండ్లలో ఏనాడూ హోటళ్లలో పెట్టలేదని గుర్తు చేశారు. ఓడిపోయిన నాయకులను తీసుకొచ్చి సమావేశంలో కూర్చోబెట్టడం దురదృష్టమని తెలిపారు. ఇలాంటి చర్యలను ఖండిస్తూ తాము సమావేశాన్ని బహిష్కరించామని వివరించారు.

నేతన్నల జీవన ప్రమాణాలు పెంచాలి

వస్త్ర ఉత్పత్తులు అత్యధికంగా సిరిసిల్లకే ఇవ్వాలి .. సిరిసిల్ల మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం

రాజన్న సిరిసిల్ల జిల్లా మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ లాంటి వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు అధికశాతం సిరిసిల్లకే ఇచ్చి కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలి. సిరిసిల్లలో అధిక శాతం మంది పవర్‌లూం పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న 20 వేల పైచిలుకు మరమగ్గాలకు 90 శాతం విద్యుత్తు సబ్సిడీ ఇవ్వాలి' అని సిరిసిల్ల మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. రాజన్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన శనివారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 18 అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ మేరకు చైర్‌పర్సన్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి నేతన్నల ఆకలిచావులు, ఆత్మహత్యలకు పాల్పడ్డారని, కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, వివిధ వస్త్రాల తయారీ ఆర్డర్లు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించిందని గుర్తుచేశారు. ఈ ఆర్డర్ల వల్ల కార్మికులతోపాటు, యజమానులు, ఆసాములు, పరిశ్రమలకు చేయూత లభించిందని తెలిపారు. గత ప్రభుత్వం ఆదుకున్నట్టే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, 2018లో మున్సిపాలిటీలో విలీనం చేసిన సిరిసిల్ల శివారులోని పెద్దబోనాల, చిన్నబోనాల, పెద్దూరు, సర్దాపూర్, రాజీవనగర్, చంద్రంపేట, రగుడు గ్రామాలను ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు యథావిధిగా గ్రామ పంచాయతీలుగా కొనసాగించాలని తీర్మానించినట్టు వివరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, అద్దె ఇంటి వారికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు రాయితీ, ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సమావేశం చర్చించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ మీర్జా అలీబేగ్, టీపీవో అన్సారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇదేం ప్రజాపాలన?

- కల్యాణలక్ష్మి, తులం బంగారం ఎక్కడ?
- అర్ధరాత్రి వేళ చెక్కులివ్వడమేంటి?
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం

వీణవంక, డిసెంబర్ 30: కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను ప్రోటోకాల్ పాటించకుండా, నియోజకవర్గ ఎమ్మెల్యేనైనా తనకు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి చెక్కులు పంపిణీ చేయడమే ప్రజాపాలనా? అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన కరీంనగర్ జిల్లా వీణవంకలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన సమీక్షలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి సహకరించాలని ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్‌కు చెబుతానన్నట్టు తెలిపారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఆర్డీవో, తహసీల్దార్ శుక్రవారం అర్ధరాత్రి వేళ లబ్ధిదారులకు చెక్కులు అందజేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తాను ఇంటింటికీ తిరిగి చెక్కులు పంపిణీ చేస్తుంటే చూసి ఓర్వలేక, ఇబ్బంది పెట్టాలనే అర్ధరాత్రి 12 గంటలకు చెక్కులు పంపిణీ చేశారని విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గవద్దని ఆయన కలెక్టర్‌కు సూచించారు.